నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 12 జులై 2024 | పేజీలు 8

## నేడు పొదలకూరుకు
# ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక



పొదలకూరు, మేజర్‌న్యూస్ : పట్టణంలోనే రైతు బజార్‌లో శుక్రవారం ఆహార, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సరసమైన ధరలో నాణ్యమైన సరుకులను అందించేందుకు ప్రత్యేక అమ్మకాల కౌంటర్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ ప్రారంభిస్తారని మండల టీడీపీ నాయకులు తెలిపారు.

## కమిషనర్ వికాస్ మర్మత్‌కు
# ఘనంగా వీడ్కోలు



3లో

# ఇదేందబ్బా.. దోపిడీ




అనంతసాగరం, మేజర్‌న్యూస్ :

అనంత సాగరం మండలం పడమటి కంభంపాడు ఇసుక రీచ్ కేంద్రంగా ఇష్టారాజ్య అక్రమ ఇసుక దోపిడీ మొదలైంది. ప్రభుత్వం నుంచి ఇంకా పూర్తిస్థాయి ఇసుక పాలసీ విధానం స్థానిక అధికారులకు రాకమునుపే పెన్నాలో ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. పడమటి కమ్మంపాడు పంచాయతీ రీచ్ పరిధిని దాటి ఉప్పలపాడు గ్రామ సమీపాన భారీ యంత్రాలతో, అంతే భారీ వాహనాలలో యదేచ్ఛగా తరలిస్తున్నారు. ఉచిత ఇసుక నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగుతున్నా.. అధికార యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు సైతం మౌనం వహిస్తూ ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారికంగా పంచాయతీకి అనుమతులు ఉండి ఉంటే.. కూలీలతో ఇసుకను పోసి, అనుమతి బిల్లులతో ఇసుక తరలింపు సాగాల్సి ఉంది. అయితే అటువంటి ఏ పరిస్థితులు ప్రస్తుతం ఇక్కడ కానరావడం లేదు. కంభంపాడు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడి అండదండలతో బద్వేలుకు చెందిన సూర్య కంపెనీ ఈ ఇసుక దందాకు తెగ బడిందన్న ఆరోపణలు తీవ్రంగా వినవస్తున్నాయి. గతంలో యంత్రాలతో ఇసుకను తవ్వడంపై స్థానిక కూలీలు, టీడీపీ నాయకులు పలుమార్లు నిరసనలు, ధర్నాలతో హోరెత్తించారు. వందలాది కూలీల జీవన భృతికి విఘాతం కల్పించడంపై కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లిన సందర్భాలు ఉన్నాయి. కానీ.. నేడు అంతా మౌనం వహిస్తూ ఉండడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ తంతు గమనిస్తున్న వైసీపీ నాయకులు ఇసుక అక్రమ దోపిడీపై మండిపడుతున్నారు. తమ ప్రభుత్వ హయాంలో పలు విధాలుగా విమర్శలు గుప్పిచ్చిన ఆ పార్టీ నాయకులు.. నేడు మిన్నకుండిపోవడం ఏమిటి ? అని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మంత్రి ఆనం ఇలాఖాలో

-మిగతా 3లో

**అసలు అధికారిక అనుమతులు లేవు. ఉచిత ఇసుక ఊసే కానరావడం లేదు. మంత్రి ఆనం ఇలాఖాలో భారీ యంత్రాలతో ఇసుక దోపిడీ జరుగుతోంది. ఎవరన్నది తెలిసినా.. అధికార పార్టీ నేతలే మౌనం వహిస్తున్న వైనం.**

## భూగర్భ జలాలు పెంచేవిధంగా
# ప్రణాళికలు



3లో

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన
# ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



వివరాలు 3లో

## నరసప్పనాయుడుకి జీవితకాల సాఫల్య అవార్డు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

మర్రిపాడు, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలోని దేవరపల్లి (ఎన్‌ఎల్‌ఎస్)లో భారత పొగాకు బోర్డు సమితి ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ రైతు పురస్కార కార్యక్రమంలో జిల్లాలోని మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షులు గాలి నరసప్ప నాయుడుకి జీవిత కాల సాఫల్య అవార్డు దక్కింది. ఈ సందర్భంగా రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుపాటి పురందేశ్వరి, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేశకుమార్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. దీంతో డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని రైతులు అధికారులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్, టిఐఐ డైరెక్టర్ శరద్ తండన్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పొగాకు బోర్డ్ సెక్రటరీ దివి వేణుగోపాల్ అన్ని వేలం కేంద్రాల రైతులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

## పథకాలెన్నీ అమలు చేస్తున్నా..
# సర్కారు బడుల్లో తగ్గుతున్న విద్యార్థులు




**విలీనంతోనే హూనం - 9 పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం**

**ఆత్మకూరులో రెండు పాఠశాలల్లో సున్న నమోదు**

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తాం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక దశలోనే పునాదులు వేస్తాం, ఆంగ్లమాధ్యమం ప్రవేశపెడుతున్నాం, చిన్నారులందరినీ సర్కారు బడులకు రప్పిస్తాం, అమ్మఒడి, మధ్యాహ్నంభోజనం, విద్యాదీవెన, విద్యాకానుక, యూనిఫారం దుస్తులు, బూట్లు,టైలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇస్తామంటూ ఎన్నెన్నో ప్రయోగాలను ప్రభుత్వం చేస్తున్నా.. తీరా చూస్తుంటే ఏయేటికాయేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. తల్లిదండ్రులు కాన్వెంట్లపై మోజు పెంచుకుంటున్నారు. ఆత్మకూరు మండలంలో గత 2 విద్యా సంవత్సరాలు, ఈ విద్యా సంవతర్సరం పరిశీలిస్తే విద్యార్థుల సంఖ్య పెరగకపోగా తగ్గిపోతోంది. మండలంలో ఈదఫా పరిశీలిస్తే ఉన్నత పాఠశాలలు 13, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 63 ప్రభుత్వ పరంగా ఉన్నాయి.

-మిగతా 2లో

# బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** బడి ఈడు పిల్లలను బడిలోనే ఉండాలని ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వరికుంటపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య మాట్లాడుతూ.. 6 నుంచి 14 ఏళ్లలోపు వయసు గల బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను తల్లిదండ్రులు చొరవ తీసుకుని తిరిగి బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బూట్లు అందించడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, చంద్రమౌళి, సుభద్ర, సుజనా కుమారి, సుజాత, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఉప్పు కొండయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# పథకాలెన్నీ అమలు చేస్తున్నా.. సర్కారు బడుల్లో తగ్గుతున్న విద్యార్థులు

*(మొదటి పేజీ తరువాయి)*

ఈ విద్యాసంవత్సరం ఆరంభమై రెండు నెలలు గడవడం, అడ్మిషన్లు పూర్తికావడం జరుగగా ఈ 76 పాఠశాలల్లో 1 నుండి 10తరగతుల విద్యార్థుల సంఖ్య 4483గా ఉండగా 13 ఉన్నత పాఠశాలల్లో 2817 మంది విద్యార్థులు కాగా మిగతా 63 ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 1664 మంది వమండలంలో మాత్రమే ఉన్నారు. సగటున ఒక పాఠశాలకు 26.4మంది ఉన్నారు. మండలంలోని ఆరవేడుజంగాలపల్లి, అల్లీపురం పాఠశాలల్లో విద్యార్థులు గతంలో ఉన్నవారు వెళ్ళిపోగా ఈదఫా సున్న నమోదు కావడంతో ఆపాఠశాలలు మూతపడ్డాయి. మండలంలోని 10 మందికన్నా విద్యార్థులు తక్కువగా 9 పాఠశాలలు, 25 మందికన్నా తక్కువగా 22 పాఠశాలలున్నాయి. సాతానుపల్లి పాఠశాలలో 6మంది, చెర్లోయడవల్లి పాఠశాలలో 8మంది, మురుగుళ్ళ మెయిన్ పాఠశాలలో నలుగురు, అప్పారావుపాళెం ఈస్ట్ ఎస్‌సి పాఠశాలలో 7మంది, ఆత్మకూరు ఈస్ట్ పాఠశాలలో 10మంది, ఎల్‌ఆర్‌పల్లి ఉర్దుపాఠశాలలో ముగ్గురు, ఎల్‌ఆర్‌పల్లి మెయిన్ పాఠశాలలో 6 మంది, వాసిలి ఎస్‌సి పాఠశాలలో 5మంది, పేరారెడ్డిపల్లి ఎస్టీ పాఠశాలలో 7 మంది, రావులకొల్లు పాఠశాలలో ముగ్గురు మాత్రమే విద్యార్థులుండడంతో ఈ పాఠశాలల మనుగడ ప్రశ్నార్ధకంగా ఉంది. ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి ఉర్దుపాఠశాలలో 2021-22లో ఒక్క విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు, 2022-23లో నాలుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఈదఫా ముగ్గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఒక స్వీపర్‌కూడా పనిచేస్తుండగా ఈపాఠశాలకు రెండు పక్కా భవనాలుండగా రిపేర్లు, బాత్‌రూముల నిర్మాణాన్ని ప్రభుత్వం 12లక్షల రూపాయలుతో చేసింది. రావులకొల్లులో గత ఏడాది ఐదుమంది, ఈదపా ముగ్గురు విద్యార్థులు కాగా రెండు భవనాలుండగా మళ్ళీ 17 లక్షల రూపాయలతో భవనాలు నిర్మించారు. నాడు-నేడు అంటూ అవసరం ఉన్నా లేకున్నా లక్షలాదిరూపాయలు వెచ్చించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఈపరిస్థితి ఏర్పడింది. వ్యవస్థ అస్థవ్యస్థంగా మారింది. మొన్నటిదాకా అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేకచట్టాలు తేవడం, అనేక యాప్‌లు ప్రవేశపెట్టడం, అనేక పథకాలు అమలు చేయడం అందరికీ తెల్సిందే. దాంతో వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని సర్వత్రా అభిప్రయపడుతున్నారు. ఇలాంటి పరిణామాలతో అనేక మంది తల్లిదండ్రులు తమ బిడ్డలను వ్యవప్రయాసలతో ప్రవేటు స్కూళ్ళలో



చేర్చుతున్నారు. ఇక 14 సంవత్సరాలలోపు చిన్నారులు బడి బయట ఉండరాదని, అనేక చట్టాలు అమలు చేస్తున్నా చిత్తు కాగితులు సేకరించడం, ఇతరత్రా పనుల్లో నిత్యంత బయట డ్రాపవుట్స్‌గా కన్పిస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 76 కాగా 2021-22లో 5503మంది విద్యార్థులు కాగా 2022-23లో 5126 మందిగా, 4481 మంది విద్యార్థులున్నారు. ఏటా ఎన్నెన్నో రూ.కోట్లతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రయోగాలు చేస్తున్నా విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉండగా ఒక్క ఆత్మకూరు మండలంలోనే రెండు పాఠశాలల్లో సున్ననమోదు, 10 మంది కన్నా విద్యార్థులన్న పాఠశాలలు 10 కాగా 25మందికన్నా తక్కువగా 22పాఠశాలలుండ డం గమనార్హం, ముగ్గురు, నలుగురు, ఐదుమంది విద్యార్థులన్న చోట వారు ఖచ్చితంగా ఆ పాఠశాలలో చదివేవారేనా, పాఠశాల ఉనికి కోసం ఒకటి, రెండు పేర్లు తూతూమంత్రంగా నమోదు చేశారా అనే సందేహం కూడా ఉంది. పలు ప్రాథమిక పాఠశాలల్లోనుండి 3,4,5 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు పంపినా అక్కడ వారికి ప్రత్యే కంగా ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదు. ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజి అని ప్రకటించిన ప్రభుత్వం ఆత్మకూరులో రెండేళ్ళ క్రితం ఒక మహిళా జూనియర్ కాలేజిని ప్రారంభించి ఒక్కరినీ కూడా సిబ్బందిని, అధ్యాపకులను నియమించనందున ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులే బోధించగా పరిక్షల్లో ఈకాలేజిలో అత్యధికంగా విద్యార్థినిలు ఇంటర్‌లో ఫెయిల్ కాగా, ప్రభుత్వం ప్రయోగం విఫలమైందని భావించి కాలేజిని మూసివేశారు. ఈ నూతన ప్రభుత్వం గత చట్టాలను పున:పరిశీలించాలని, కొన్నింటిని రద్దు చేయాలని, అస్థవ్యస్థంగా మారిన విద్యా వ్యవస్థను సక్రమ బాటలోకి తేవాలని, విద్యార్థులు అధికంగా రూ.కోట్లు వెచ్చించే ప్రభుత్వపాఠశాలల్లో చేరేలా చూడాలని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ ఎం.శివ కల్పన, ఎన్.వినీతల ఆధ్వర్యంలో గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఉదయగిరి పురవీధులలో ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక పీహెచ్చెసీ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డ బిడ్డకు మధ్యంతరం ఉండాలని డబ్ల్యూహెచ్ఓ నిర్ణయించడమైందని వారు తెలియజేశారు. ఈ సంవత్సరం స్లోగన్‌గా కుటుంబ ప్రణాళిక అనేది అభివృద్ధి చెందిన భారతదేశానికి కొత్త గుర్తింపు, గర్వకారణం.. కాన్పు మధ్య ఎడం – తల్లి బిడ్డల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం – దేశ సౌభాగ్యం, చిన్న కుటుంబం – చింతలేని కుటుంబం అనే స్లోగన్లు ఇచ్చుకుంటూ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివకుమారి, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు హస్తానయ్య, శ్రీనివాసులు, రబ్బాని, ఏఎన్ఎంలు నూర్జహాన్, సుప్రజ, పద్మావతి, జయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మించాలంటూ ఎమ్మెల్యే సోమిరెడ్డికి విజ్ఞప్తి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మామిడిపూడి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఎల్లవ కాలువపై ప్రజా ప్రయోజనాల నిమిత్తం సత్వరమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మండల పార్టీ బీజేపీ అధ్యక్షుడు వేల్లపాలెం సంపత్ రెడ్డి వినతి పత్రాన్ని ఇచ్చారు. వంతెన లేకపోవడం వల్ల ప్రజలు పడుతున్న కష్టాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. మూడు గ్రామాల ప్రజలు, అదేవిధంగా పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు ఈ రోడ్డు మార్గం ద్వారా వెళ్లాలని తెలియజేశారు. దీంతోఎమ్మెల్యే స్పందించారు. నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు బీజేపీ అధ్యక్షుడు తెలిపారు.

## కన్వర్షన్ భూమి పరిశీలించిన ఆర్డీఓ




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కొరపల్లి వద్ద ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని ఆర్డిఓ మధులత గురువారం పరిశీలించారు. గిరి ఆనకట్ట వద్ద టూరిజం శాఖకు సంబంధించిన భూమిని ఆక్రమించారని ఫిర్యాదు అందడంతో టూరిజం స్థలాన్ని పరిశీలించి ఆక్రమణ ఉంటే సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ తహసిల్దార్ పివి కృష్ణారెడ్డి, వీఆర్వోలు అనూష, వెంకట్, సర్వేయర్లు రవి, మీరావలి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొట్టేపాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ.. న్యాయపరమైన సలహాలు సూచనలు ప్రజలకు వివరించారు. గ్రామాలలో ప్రజలు కక్షపూరిత వాతావరణంలో లేకుండా సులభంగా సమస్యలను పరిష్కరించేలా వివరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా రైల్వే జడ్జి వినోద్ కుమార్, మూడవ అదనపు సివిల్ జడ్జి అఖిల, సూళ్లూరుపేట సివిల్ జడ్జి అనూష, కావలి సివిల్ జడ్జి, నెల్లూరు రూరల్ మండల అభివృద్ధి అధికారి రాజ్యలక్ష్మి, నెల్లూరు రూరల్ విస్తరణ అధికారి పెంచల శ్యామ్, మండల ఎద్యుకేషన్ అధికారి, నెల్లూరు రూరల్ ఆర్డబ్ల్యూఎస్ అధికారి, నెల్లూరు రూరల్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్, నెల్లూరు రూరల్ మండలస్థాయి నాయకులు ఇందుపూర్ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ ఏడుకొండలు, గ్రామ ఎంపీటీసీ ఎన్.నారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ కార్యదర్శిగా షేక్ మునీర్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బారాషాహీద్ దర్గా రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ కార్యదర్శిగా షేక్ మునీర్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు వక్ఫ్ బోర్డు నుంచి అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. గత 17 ఏళ్లుగా ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులుగా ఆయన పనిచేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ ఏడాది రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ కార్యదర్శిగా నియమించారు.

# భూగర్భ జలాలు పెంచేవిధంగా ప్రణాళికలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో భూగర్భ జలాలు పెంచే విధంగా కొత్త పథకాలకు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కేంద్ర భూగర్భ జలమండలి ఆధ్వర్యంలో టైర్ త్రీ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టే చెక్ డ్యాములు, వాటర్ షెడ్స్ ఎక్కువ స్థాయిలో భూగర్భ జలాలు నిలవలు ఉండే విధంగా డిజైన్లు తయారు చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా శాఖ చేపట్టే పనులు భూగర్భ జలాలు పెరిగే విధంగా సాంకేతిక అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్లానింగ్ చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖలకు సంబంధించి రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగునీరు వినియోగించుకునే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన సూచించారు. కేంద్రీయ భూగర్భ జల మండలి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితులను తెలియజేసే ఫోటో ప్రదర్శనను ఆయన తిలకించారు. కార్యక్రమంలో కేంద్ర భూగర్భ జలమండలి డిప్యూటీ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి, కేంద్ర భూగర్భ జల శాఖ శాస్త్రవేత్త రవికుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసులు, డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, జిల్లా జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.శోభన్ బాబు, వ్యవసాయ, ఉద్యానవన, డ్వామా, డిఆర్‌డిఎ, ఏపీ మైక్రో ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 29 అంశాలకు పంచాయతీ పాలకవర్గం ఆమోదం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు గ్రామపంచాయతీలో 29 అంశాలను ఆమోదిస్తూ పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. స్థానిక సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఆమెతో పాటు 14 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీర్మానించిన అంశాలపై సమీక్ష జరిపారు. అనేక అంశాలను వార్డు సభ్యులు ప్రతిపాదించగా పంచాయతీ పాలకవర్గం ఆమోదం తెలిపింది. పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని వార్డు సభ్యులు డిమాండ్ చేయగా పాలకవర్గం ఓకే చెప్పింది. ఈ విషయాన్ని డివిజనల్ పంచాయతీ అధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కమిషనర్ వికాస్ మర్మత్‌కు ఘనంగా వీడ్కోలు





**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన వికాస్ మర్మత్‌కు కార్యాలయం సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం జరిగిన ఆత్మీయ అభినందన వీడ్కోలు కార్యక్రమంలో కమిషనర్‌గా వికాస్ మర్మత్‌ను నగర పాలకసంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విశిష్ట సేవా అవార్డులను అందుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. దాదాపు గడచిన 15 నెలల కాలంలో కమిషనర్‌గా ఆయన చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, సంస్కరణలు అభినందనీయమని పలువురు ప్రశంసించారు. భవిష్యత్తులో తిరిగి నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా వికాస్ మర్మత్ బాధ్యతలు స్వీకరించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మున్సిపల్ కార్పోరేషన్, నెల్లూరు వారి ఆధ్వర్యంలో కమిషనర్‌ను ఘనంగా సత్కరించి వినాయక ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ మలోల, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్ కుమార్, అదనపు కమిషనర్ శర్మద, డెప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, సిటీ ప్లానర్ దేవీ కుమారి, టీపీఆర్ఓ ప్రసాద్, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మేనేజర్ ఇనయతుల్లా, ఉద్యోగ సంఘాల నాయకులు శీనయ్య, చక్రపాణి, కృష్ణకిషోర్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పొదలకూరు, విరువూరు, తోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు గురువారం ప్రకటించిన ఫలితాల్లో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీ హైస్కూల్‌కి చెందిన కె.స్నేహిత, బుజ్జా హిమవర్ష, విరువూరు హైస్కూల్‌కి చెందిన అవ్వారి భవ్య చరిత, తోడేరు హైస్కూల్‌కి చెందిన బైనపూడి సుకృత ఎంపికయ్యారు. స్నేహితకు పదో తరగతిలో 576 మార్కులు, హిమ వర్షాలకు 570 మార్కులు రాగా, అవ్వారి భవ్య చరిత 569 మార్కులు పొంది, వారు ఈ సీట్లుకు అర్హత సాధించారు. వీరిలో హిమవర్ష, భవ్య చరిత ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ సీట్లు లభించగా, స్నేహితకు నూజివీడులో సీటు లభించింది. అలాగే తోడేరులోని కాకాణి శేషమ్మ ఉన్నత పాఠశాలకు చెందిన బైనపూడి సుకృత నూజివీడు క్యాంపస్‌లో సీటు సాధించిందని ఆ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సీటు సాధించిన విద్యార్థినికి విద్యాశాఖ అధికారులతో పాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థినిలు మాట్లాడుతూ.. తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, అంకితభావంతో కూడిన విద్యా బోధనతో తాము ఈ సీట్లు సాధించగలిగామని తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని సునందా, బి పద్మజ, భోదన, భోదనేతర సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు అభినందించారు.

# కౌలు రైతు సాగు హక్కుపై అవగాహన సదస్సు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** పంటలు సాగు చేస్తున్న కౌలు రైతుల హక్కులు, వారికి చేకూరే ప్రభుత్వపర తోడ్పాటు తదితర విషయాలపై గురువారం తహసిల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు జరిగింది. నేటి నుంచి 23వ తేదీ వరకు గ్రామ రైతు సేవా కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఏవో శ్రీనివాస చక్రవర్తి గ్రామస్థాయి రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కౌలు రైతులు పంటల సాగు నేపథ్యంలో అనుకోని విపత్తులు సంభవించి నష్టం వాటిల్లినా.. ప్రభుత్వం తరఫున ఎటువంటి సహకారాలు పొందుతారనే విషయాలను వివరించారు. గ్రామస్థాయి సదస్సులు నిర్వహించి వారికి అవగాహన కల్పించాలని, ఈ కార్యక్రమాన్ని ప్రతి కౌలు రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఇదేందబ్బా.. ఈ దోపిడి !?

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న సరికొత్త ఇసుక దోపిడీ పాలసీ వింతగా ఉందే.. అని చమత్కరిస్తున్నారు. సోమశిలకు చెందిన ఓ గృహ నిర్మాణకుడు ఇంటికై ఇసుక కోసం వెళ్లగా.. వారు నిరాకరించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై డిప్యూటీ తహసిల్దార్ గిరీష్‌ను వివరణ కోరగా.. ఇప్పటి వరకు తమకు రీచ్ నిర్వహణకై సంబంధించి ఎవరికి ఎటువంటి అనుమతులు ఇచ్చినట్లు తమ దృష్టికి రాలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలసీ నిబంధనల ప్రకారం యంత్రాలతో తవ్వకాలు చేయవచ్చా.. అనే ప్రశ్నకు లేదని చెప్పడం గమనార్హం. పూర్తిస్థాయి ఇసుక పాలసీ మార్గదర్శకాలు రావాల్సి ఉందని అధికారి తెలిపారు. ప్రస్తుత తీరు విషయం తనకు కూడా అర్థం కావటం లేదని తెలపడం విశేషం. రీచ్ సరిహద్దులు దాటి పెన్నా ఏటిలో ఇసుకను కొల్లగొడుతున్న వారు ఎవరో తేల్చాలని, ఏ తరహా అనుమతులు ప్రస్తుత ఇసుక తవ్వకదారులకు ఎవరు ఇచ్చారో బహిర్గతం చేయాలని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులు తగుఅవగాహనతో పంటసాగుచేయాలి

## - మండల వ్యవసాయాధికారి కిషోర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులు పంటల సాగు, యాజమాన్యంలో తగు మెళుకువలు పాటించాలని, తగిన అవగాహనతో వ్యవహరించాలని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్ పేర్కొన్నారు. సాగునీటి లభ్యత, వనరులనుబట్టి పంటలు సాగుచేయాలని, అవసరానికనుగుణంగా ఎరువులు, సస్యరక్షణ మందులు వినియోగించాలని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలో కౌలు రైతులకు అవగాహనా సదస్సులను మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో శుక్రవారం నుండి వారంరోజులపాటు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కౌలురైతులకు పంటసాగుదారుల హక్కుపత్రం (సిసిఆర్‌ఏ)ల గురించి. వాటిని పొందడం, ప్రయోజనాలు గురించి అవగాహన కల్పిస్తామని ఆయన వెల్లడించారు. మండలంలో సుమారు 800మంది కౌలు రైతులుంటారని, గత ఏడాది సిసిఆర్‌ఏ సర్టిఫికేట్లు ఇచ్చామని, మళ్ళీ రెన్యువల్, నూతనంగా పొందడం గురించి అవగాహన కల్పిస్తామన్నారు. కౌలురైతులకు కార్డులుంటే ప్రభుత్వం నుండి లభించే విత్తనాలు, సబ్సిడిలు తదితర ప్రయోజనాలు ఉంటాయని కిషోర్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు ఇప్పటివరకు మండలంలో 98.4క్వింటాళ్ళ జీలుగలు, 33.76 క్వింటాళ్ళ పిల్లిపెసలు, 11.7క్వింటాళ్ళ జనుములు పంపిణీ చేశామని, ఇంకా అవసరమైనవారికి విత్తనాలు త్వరలో వస్తాయని కిషోర్ పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి లభ్యతనుబట్టి బోర్లుక్రింద దాదాపు 300ఎకరాల వరినాట్లును రైతులు వేశారని, కనుపూరుపల్లి, కరటంపాడు, అప్పారావుపాళెం, బండారుపల్లిల్లో సాగు చేశారని, ఆత్మకూరు మండలంలో సాగునీరు సమకూరాక రబీలోనే అధికంగా పంటలు సాగుచేస్తారని వ్యవసాయాధికారి వివరించారు. మండలంలో తమ ఆధ్వర్యంలో ఒక ఏయివో, ఇద్దరు ఎంపియివోలు, అన్ని ఆర్‌ఎస్‌కెలలో ఒక్కో వివిఏలు ఉంటారని, రైతులకు అవసరమైన సేవలను అందుబాటులో ఉంటూ అందిస్తున్నామని వ్యవసాయాధికారి కిషోర్ పేర్కొన్నారు.

# ఆత్మకూరు మున్సిపాలిటీపై ప్రత్యేకదృష్టి సారించిన మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యలు, అవకతవకలు తదితర అంశాలపై స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల ఆత్మకూరులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నెల్లూరులోని తమ క్యాంప్ కార్యాలయంలో కూడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆత్మకూరులో ప్రజలందరికీ ప్రతిరోజూ క్రమం తప్పకుండా తాగునీరు సరఫరాజరగాలన్న లక్ష్యంగా 66కోట్ల రూపాయలతో తాను బృహత్తర తాగునీటి పథకాన్ని గతంలో మంజూరు చేయించి ఆత్మకూరుకు అందించానని, అయినా ఇంకా రెండురోజుల కొకదపానే తాగునీటి సరఫరా జరుగుతుందని పేర్కొంటూ సీరియస్ అయ్యారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో కూడా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో అవసరాలు, ప్రజాసమస్యలు, అక్రమ లే అవుట్లు, ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల గుర్తింపు, మున్సిపల్ బస్టాండు నిర్మాణం వివరాలు, అక్కడి గదులు, గత ఐదేళ్ళలో జమాఖర్చులు తదితరాల వివరాల నివేదికలను శీఘ్రంగా అందజేయాలని రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. దాంతో త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కారం కాగలవని, నిధుల దుర్వినియోగం, ఆక్రమణలు తదితరాలన్ని వెలుగులోకి రాగలవని పలువురు చర్చించుకుంటున్నారు.

# జిల్లాలో సంతృప్తికరంగా ఆపస్ సభ్యత్వం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) సభ్యత్వ నమోదు అత్యంత సంతృప్తికరంగా ఉందని జిల్లా ఆపస్ ప్రధానకార్యదర్శి పట్నం అనీల్‌కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల, విద్యాపరమైన సమస్యలపట్ల నిరంతరం రాజీలేని పోరాటాలు సాగించే తమ యూనియన్ సభ్యత్వ నమోదు ఇటీవల జిల్లాలో మండలాలవారీగా నిర్వహించగా మంచి స్పందన లభించిందని, అధికంగా ఉపాధ్యాయులు ఆకర్షితులై తమ యూనియన్ సభ్యత్వం స్వీకరించారని, జిల్లాలో నెల్లూరు రూరల్ మండలం అత్యధికంగా 200 సభ్యత్వం నమోదు చేసి రికార్డు సృష్టించారని అనీల్‌కుమార్ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండల ఆపస్ నాయకులను రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజగోపాలాచార్యులు, తాను, జిల్లా అదనపు కార్యదర్శి పులి జయ రాజేశ్వరరావు, మండల అధ్యక్షులు సుబ్బారావు, మండల ప్రధానకార్యదర్శి తిరుపతి తదితరులంపాల్గొన్నామని అనీల్‌కుమార్ తెలిపారు.

# కౌలు రైతు కార్డులపై అవగాహన సదస్సు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని మర్రిపాడు సచివాలయం నందు గురువారం రైతులకు కౌలు కార్డులు వాటి యొక్క ప్రాముఖ్యత, వాటికి కావలసినటువంటి అంశాలను గురించి వివరించారు. కౌలు కార్డు కావాల్సిన రైతులు భూ యజమాని యొక్క 1బి జిరాక్స్ మరియు ఆధార్ జిరాక్స్ కాపీ భూ యజమాని ఫోన్ నెంబరు, అలాగే కౌలు తీసుకునే రైతు తన పాసుపోర్టు సైజ్ ఫోటో, ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబర్ పైవన్నీ తీసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించవలసినదిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ఎస్.రామమోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎన్.లక్ష్మిలహరి, విఆర్ఓ ఎన్.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

# కిలారు వెంకట స్వామి నాయుడు స్మారక సభలో : గునుకుల కిషోర్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛమైన చిరునవ్వుతో నిండుగా పలకరించే కీ.శే.కిలారు వెంకట స్వామి నాయుడు స్మారక సభలో జనసేన నాయకులు గునుకుల కిషోర్ దాదాపుగా 40 సంవత్సరాలుగా రెండుసార్లు కార్పొరేటర్‌గా ఒకసారి గంథాలయ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నెల్లూరు ప్రజల మదిలో చెరగని ముద్ర వేసిన కిలారి వెంకటస్వామి నాయుడు ఇకలేరు అనే విషయం నమ్మశక్యం కాని నిజం దాదాపుగా నాలుగు దశాబ్దాల పాటు ఒకే పార్టీలో ఉంటూ అందరూ మన్ననలూ పొందుతూ రాజకీయంగా ఎలా నడవడుచుకోవాలో అనే విషయాన్ని నాలాటి వారికి మార్గదర్శకంగా నిలిచారు. నిన్నటి రూరల్ నిన్నటి ఎన్నికల్లో కూడా ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు నిస్వార్ధంగా పనిచేసిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



# కోనోకార్పస్ చెట్లు తొలగింపు

## బుచ్చి నగర కమిషనర్ రమణబాబు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆంద్రప్రదశ్‌లో కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ.. ఈ మొక్కల కారణంగా ప్రజలు శ్వాసకోస సమస్యలు, ఆస్తమా వంటి సమస్యలు ఎదురవుతాయని అటు పర్యావరణానికి, ఇటు ప్రజారోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసినట్లు బుచ్చి నగరపంచాయితీ మొదటిగా నగర ప్రధాన వీధుల్లో చెట్లను తొలగించడం జరిగుతుందని తదుపరి ఎక్కడ ఉన్న చెట్లు తొలిగించడం జరుగుతుందని తెలిపారు.

# లాంఛనంగా పూజా కార్యక్రమాలలో జనసేన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** త్వరలో మా ప్రియతమ నాయకుడు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, జనసేన జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమగును ప్రతి జనసైనికుని మనసులో మాట మా కార్యాలయం ఎక్కడ అనే వాక్యాన్ని పూరిస్తూ భవిష్య జనసేన కార్యకర్తల పునాది వేస్తూ ప్రజలందరూ అనుకుంటున్నట్లుగా మన సమస్యకు పరిష్కారం జనసేన పార్టీ దానికి నెల్లూరు జిల్లాలో వేదిక గోమతి నగర్ ఈ కార్యాలయం అనే విధంగా ప్రారంభమైంది జనసేన వీర మహిళలు ముఖ్యనాయకులు కార్యకర్తలు నడుమ కోలాహలంగా పూజా కార్యక్రమాలు పూర్తి అయ్యాయి.

# మృతుల కుటుంబాలకు 'కంచి' ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల మృతిచెందిన ఆరు మంది కుటుంబాల వారిని నిత్యాన్నదాత, శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేల రూపాయలవంతున రూ.60వేల రూపాయలను అందజేశారు. గత 14నెలల క్రితం ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌పేషెంట్లు, వారి సహాయకులు, ఇన్‌పేషెంట్ల సహాయకులు దాదాను ఆరేడువందల మందికి ప్రతినిత్యంత ఉచితం అత్యంత రుచికరమైన భోజనాన్ని సమకూరుస్తున్న పరమేశ్వరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఆజన్మాంతం నిర్విరామంగా కొనసాగిస్తామని ప్రకటించి అందుకుగాను హాస్పిటల్ ప్రాంగణంలో దాదాపు 60లక్షల రూపాయలతో భవనం కూడా స్వంత నిధులతో నిర్మించారు. దాంతోపాటు ఆయన సామా జిక సేవా కార్యక్రమాలు తమ స్వంత గడ్డపై అందించాలని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎవరు మృతిచెందినా ఆ కుటుంబానికి 10వేల రూపాయలవంతున స్వంత నిధులు అందించేలా గత 7నెలలక్రితం ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఆయన స్వంత నిధులతోనే ఒక కైలాస రథయాత్ర వాహనాన్ని, నాలుగు శవ శీతల పేటికలను కూడా సమకూర్చారు. నిత్యం జనాలు ఇబ్బందిపడుతున్న దృష్ట్యా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండువద్ద, నెల్లూరు–ముంబాయి జాతీయ రహదారిపై నెల్లూరుపాళెం కూడలి వద్ద తాగునీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాజాగా ఇటీవల మృతిచెందిన 8వ వార్డు పరిధిలోని బొజ్జాసుబ్బారెడ్డి కుటుంబాన్ని, 11వవార్డులో పాశం వెంకటేశ్వర్లు కుటుంబాన్ని, 16వవార్డు పరిధిలోని మురుగమ్మి మాల కొండయ్య కుటుంబాన్ని, 18వ వార్డులోని శాగల మూరి జగ్గయ్య కుటుంబాన్ని, కోలా చిన్న పెంచలయ్య కుటుంబాన్ని, 22వవార్డులోని అన్నలూరి మాలకొండయ్య కుటుంబాన్ని కంచి పరమేశ్వర రెడ్డి ప్రతినిధులు కె.వి.శేషారెడ్డి, జయేంద్ర ప్రసాద్‌రెడ్డి, ఏ.నారశింహారెడ్డి 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కంచిపర మేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజి కసేవలు అమో ఘం, అత్యంత ప్రయోజనకరం, అభినందనీయమని సర్వత్రా కొనియాడుతున్నారు. సాయమందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరరెడ్డిని కొని యాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తులకు అన్నిరకాల వసతులు కల్పనే మా లక్ష్యం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు అన్నిరకాల వసతులు కల్పనే మా లక్ష్యమని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు బారాషాహీద్ దర్గాలో రొట్టెలపండుగ ఏర్పాట్లను వివిధశాఖల అధికారులు, బారాషాహీద్ దర్గా ఛైర్మెన్ ఖాదర్ బాషా, ఫెస్టివల్ కమిటి సభ్యులతో కలసి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రొట్టెలపండుగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రేపు 10 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరోసారి అధికారులతో కలసి రొట్టెలపండుగ ఏర్పాట్లను పరిశీలిస్తారు. ప్రజలకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా అన్నిరకాల ఏర్పాట్లను చేస్తున్నాం. గత రెండు మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి, వర్షాలు వచ్చినాకూడా ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా రొట్టెల పండుగకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఇబ్బంది లేకుండా క్షేమంగా వచ్చి బారాషాహీదుల ఆశీస్సులు పొంది, క్షేమంగా తిరిగి గమ్యం చేరడమే లక్ష్యంగా అందరం కలసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా పెరుగుదల, పర్యావరణంపై అవగాహన

**ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాసులు**




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని, సెట్నెల్, నెహ్రూ యువ కేంద్రం, సమగ్ర శిక్ష సంస్థల సౌజన్యంతో, జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో డి.కె. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాసులు అధ్యక్షతన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జనాభా పెరుగుదల – సామాజిక, పర్యావరణ, వ్యక్తిగత ప్రయోజనాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని, దీనిని అర్థం చేసుకొని తదను గుణంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా విద్యార్థినులకు ఉద్బోధించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెల్లూరు నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ ఎ.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎవరినీ వెనుకకు వదలకండి, ప్రతి ఒక్కరిని లెక్కించండి అనే థీమ్ తో ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, జనాభా నియంత్రణపై యువత అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీ సుధీర్ బాబు ప్రసంగిస్తూ జనాభా నియంత్రణ చర్యలతో పాటు కెరీర్ గైడెన్స్ పై అవగాహన పెంచుకొని యువత మంచి ఉపాధి అవకాశాలను చేజిక్కించుకోవాలని సూచించారు. సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ జనాభా నియంత్రణ ద్వారానే అభివృద్ధి సాధ్యమౌతుందని గుర్తించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వకృత్వం, పెయింటింగ్ పోటీలలో విజేతలకు సెట్నెల్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.కొండయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, భారతి, సెట్నెల్ సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్, కళాశాల లెక్చరర్లు వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, చంద్రకళ, శ్రీదేవి, శివయ్యలతో బాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన కమ్మ ప్రభాకర్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ను కమ్మ ప్రభాకర్ నాయుడు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉండవల్లి లోని లోకేష్ నివాసానికి వెళ్లి మండలంలో జరిగిన పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ ఫ్లెక్సీలను ధ్వంసం చేస్తూ ఉన్న తీరును వివరించారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు భరోసా ఇచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ సూచించారని ప్రభాకర్ తెలిపారు.

## 'దాస్ ఫైలా'ను అరెస్ట్ చేయాలి

**అఖిలభారత బ్రాహ్మణ మహా సంఘం డిమాండ్**

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అద్వైత మతాన్ని అనుసరించే పౌరోహిత బ్రాహ్మణులను కించపరుస్తూ నానా విధాలుగా దుర్భాషలాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణలను అవమాన పరచి, బ్రాహ్మణ స్త్రీ లను అవమానకరంగా మాట్లాడిన పార్వతీపురం నియోజకవర్గం, శివిని గ్రామానికి చెందిన దాస్ పైలాను తక్షణం అరెస్ట్ చేయాలని అఖిలభారత బ్రాహ్మణ మహా సంఘం (ఏబిబిఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్జిక్యూటివ్ ప్రెసిడెంట్ రాళ్ళపల్లి కిషోర్ శర్మ, రాష్ట్ర గౌరవ సలహా దారులు రాళ్ళపల్లి బాలసుబ్రహ్మణ్యం, రాళ్ళపల్లి సుధాకర్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాధవాచార్యులు, జిల్లా కమిటీ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫేస్బుక్ వాట్సప్ యూట్యూబ్ లాంటి ప్రసార మాధ్యమాలలో బ్రాహ్మణులను కించపరుస్తూ తాను వీడియోలను అప్లోడ్ చేస్తూ బ్రాహ్మణుల మధ్య మతపరమైనటువంటి ఉద్రేకతలు చెలరేగేటట్లుగా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు ఇలాంటి సంఘటనలు పురావత్వం కాకుండా ఉండాలంటే.. పైలా దాస్‌ను తక్షణం అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బాలికల వసతిగృహంలో డార్మెంటరీ ప్రారంభం

**ఎన్ఆర్ఐ బొయిళ్ళ సహకారం**



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం రేవూరులోని బాలికల వసతి గృహంలో ఎన్ఆర్ఐ బోయిళ్ళ జనార్దన్ రెడ్డి సహకారంతో నిర్మించిన డార్మెంటరీని గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఏబిసిడబ్ల్యుఓ ఎం.శ్రీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తన భార్య లక్ష్మీ జ్ఞాపకార్థం వసతే గృహ బాలికల సౌకర్యార్థం లక్షల రూపాయలు వెచ్చించి డార్మెంటరీ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. విద్యార్థినీలు ఉన్నత లక్ష్యాలను అధిరోహించేందుకు కష్టపడి కాక ఇష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జనార్దన్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారిని మల్లేశ్వరి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లం పార్టీ వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చిరెడ్డిపాలెం దొంగలు హల్‌చల్



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెంలో గత మూడు రోజుల నుంచి దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో బ్రహ్మయ్య ఇంట్లోఎవరు లేని సమయం చూసి దొంగలు చేతివటం చూపించారు. సుమారు 5 లక్షల రూపాయల నగదు, ఒక ఉంగరం, ఒక జత కమ్మలతో ఉడాయించారు. బ్రహ్మయ్య తెలిపిన వివరాల మేరకు అతను హైదరాబాదులో ఉద్యోగ నిమిత్తం వెలిగొండగా దొంగతనం జరిగిందని గమనించిన వారి సోదరుడు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా వచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగిందని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రం సేకరిస్తున్నారు.

# కొనగలమా.. తినగలమా.. ఊరుకుండగలమా..

### ఆత్మకూరులో కూ(క్రూ)రగాయలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మార్కెట్‌లో రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న కూరగాయలను కొనగలమా, తినగలమా, లేక ఊరుకుండగలమా అంటూ అందరూ ఆవేదనతో చెబుతుండగా పలువురు మహిళలైతే ఆవేదనతోపాటు సర్కారుపై ఆగ్రహిస్తున్నారు. నెలలోపే కూరగాయల ధరలు కొండెక్కాయి. మరీ టమోటాలు, పచ్చిమిర్చి నాలుగురెట్ల ధరలు పెరిగి ఆకాశంకు చేరుకున్నారు. కానీ కూరగాయలు నిత్యావసరం, అందునా టమోటాలు, పచ్చిమిర్చి నితావ్యసరంగా ఉన్న విషయం అందరికీ తెల్సిందే. గత నెలలో ఒకకెజి టమోటాల ధర 30రూపాయలు కాగా నేడు 100 నుండి 120 రూపాయల వరకు ఉంది. పచ్చిమిర్చి గతనెలలో కె.జి ధర 40 రూపాయలు కాగా నేడు 60 రూపాయలుగా ఉంది. ఇక బెండకాయలు, వంకాయలు, కాకరకాయలు, ఉర్లగడ్డలు, చేమగడ్డలు, బీర, సొర, చిక్కుడు తదితరాలు కెజిపై 20 రూపాయల వరకు ధర పెరిగింది. కానీ టమోటాలు, పచ్చిమిర్చి కొనే పరిస్థితి లేదని, అయినా అనివార్యమై అదనపు భారం మోస్తూ తీవ్రంగా అవస్థలు పడుతున్నామని, అసలే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఉండగా కూరగాయలు మూడు రెట్లు, నాలుగురెట్లుగా పెరిగినందున సాధారణ, పేద, మద్య తరగతి జనాలు ఎలా జీవనం సాగించాలి అంటూ పలువురు ఆవేదన పడుతున్నారు. తాము మాత్రం ఏపూటకాపూట, ఏరోజుకారోజు తమ సంపాదనలో అధికంగా టమోటాలకు, పచ్చిమిర్చికే వెచ్చించాల్సి వస్తుందని పలువురు మహిళలు చెబుతున్నారు. ఈపరిస్థితి ఇలాగే కొనసాగితే పేద, మద్యతరగతి జనాలు ఎలా పొట్ట నింపుకోవాలి, ఎలా పూటగడుపుకోవాలి అని ప్రశ్నిస్తున్నారు. ఈపరిస్థితిని గురించి ప్రజాప్రతినిధులుకానీ, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకునే పరిస్థితి కానరావడం లేదని వాపోతున్నారు. వ్యాపారులు మాత్రం పైన మార్కెట్‌లో తమకు లబించే ధరలనుబట్టే తాము ధరలు పెంచి విక్రయించాల్సి వస్తుందంటున్నారు. మరి ఈసమస్యకు పరిష్కారం ఎలా, టమోటాలు, పచ్చిమిర్చి కొనుగోళ్ళే తమ సంపాదన వినియోగించుకోవాల్సిందేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరి పాలకులు ఏమైనా గమనిస్తారేమో, ధరలను నియంత్రిస్తారేమో, సబ్సిడితో సరఫరా చేసేలా యోచిస్తారేమో చూడాల్సి ఉంది.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులంతా తప్పకుండా హెల్మెట్లు ధరించాలని ఆత్మకూరు సీనియర్ సివిల్‌జడ్జి బి.రాజేష్ సూచించారు. హెల్మట్‌లేని ప్రయాణం ప్రమాద కరమన్నారు. ఇటీవల కాలంలో సుమారు 3703 ప్రమాదాలు జరిగితే అందులో హెల్మట్లులేని ద్విచక్ర వాహనదారులు 3042 మంది మీతి చెందారన్నారు. ద్విచక్ర వాహనదారులంతా తగిన అవగాహన కలిగి సురక్షిత ప్రయాణం చేసేలా తప్పకుండా హెల్మెట్ ధరించి తమ ప్రయా ణాలు సాగించాలని న్యాయమూర్తి రాజేష్ కోరారు.

## వాసిలిలో దోమల నివారణ కార్యక్రమం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** డెంగ్యు మాసోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ దోమల, లార్వా నివారణా చర్యలు చేపట్టారు. నెల్లూరు జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ ఇ.హుస్సేనమ్మ ఆదేశాలమేరకు మహిమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు డాక్టర్ దేవానంద్, డాక్టర్ అనూషాల పర్యవేక్షణలో ఆత్మకూరు మలేరియా సబ్‌యూ నిట్ ఆఫీసర్ షేక్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో గురువారం మండలంలోని వాసిలిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆగ్రామం నడిబొడ్డున ఒక కోనేరు ఉండగా నీరు నిల్వఉంటూ లార్వా అధికంగా ఉంటుంది. లార్వా నివారణకు గాను గాంబూషియా చేపలను కోనేరులో వదిలారు. ఈ చేపలు లార్వాలను తినడంద్వారా దోమల ఉత్పత్తి జరగదని వారు పేర్కొన్నారు. దోమల నివారణకు తమవంతుగా చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ యు.లలిత, హెల్త్‌అసిస్టెంట్ పి.ఆనంద్, ఏఎన్‌ఎం పి.నాగేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి టి.సుగుణ, ఆశా కార్యకర్తలు ఎం.వరలక్ష్మి, జి.శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

# పొట్టే పాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని పొట్ట పాలెం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ.. న్యాయపరమైన సలహాలు సూచనలు ప్రజలకు వివరించారు. గ్రామాలలో ప్రజలు కక్షపూరిత వాతావరణంలో లేకుండా సులభంగా సమస్యలను పరిష్కరించేలా వివరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా రైల్వే జడ్జి పి.వినోద్ కుమార్, మూడవ అదనపు సివిల్ జడ్జి అఖిల, సూళ్లూరుపేట సివిల్ జడ్జి అనూష, కావలి సివిల్ జడ్జి నెల్లూరు రూరల్ మండల అభివృద్ధి అధికారి రాజ్యలక్ష్మి, నెల్లూరు రూరల్ విస్తరణ అధికారి పెంచల శ్యామ్, మండల ఎడ్యుకేషన్ అధికారి, నెల్లూరు రూరల్ ఆర్డబ్ల్యూఎస్ అధికారి, నెల్లూరు రూరల్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్, నెల్లూరు రూరల్ మండల స్థాయి నాయకులు ఇందుపూర్ శ్రీనివాసులు రెడ్డి, గ్రామ సర్పంచ్ ఏడుకొండలు, గ్రామ ఎంపీటీసీ ఎన్.నారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో నిరుపయోగభవనాల మయం

- లక్షలాది రూపాయల నిధులు వ్యయం
- అంతులేని నిర్లక్ష్యానికి సాక్ష్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో ప్రభుత్వం లక్షలాదిరూపాయల వ్యయంతో అనేక భవనాలు నిర్మించగా వినియోగం లేకపోవడం, నిధుల కొరతతో కొన్ని భవనాల పనులు నిలిచిపోవడం అత్యధికంగా ఉంటూ అంతులేని నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని ఇరిగేషన్, మున్సిపల్, సోమశిల ప్రాజెక్టు కార్యాలయాల సముదాయ ఆవరణలో ఓ మూలన చెట్లమద్య నిర్మిణం నలిచిపోయిన భవనం దర్శనమిస్తోంది. ఆభవనం పరిస్థితి గురించి ఆరా తీయగా దాదాపు 12 సంవత్సరాల క్రితం మెప్మా కార్యాలయ భవనమని తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటిగా అప్‌గ్రేడ్ అయ్యాక మహిళలకు సంబంధించి మెప్మా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈకార్యాలయానికి భవననిర్మాణం కోసం అప్పట్లో ప్రభుత్వం 25లక్షల రూపాయలు మంజేరు చేయగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పునాదులు, శ్లాబ్‌లెవల్‌వరకు గోడలు నిర్మించి అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. అప్పట్లో అంచనాలు తక్కువవేశారన్న కారణంగా కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని, అప్పటినుండి ఈభవనం నిర్మాణంకు నోచుకొనక గోడలకే పరిమితమై కంపచెట్ల మద్య కన్పిస్తోంది. ఈభవనం పనులు పూర్తిచేయాలన్న ఆలోచనే లేకపోయింది. మెప్మా కార్యాలయాలను మహిళల సౌలభ్యం కోసం ఆత్మకూరు పట్టణంలోని పంటవీధి ప్రాంతంలో 13లక్షల రూపాయలతో ఒక భవనం, ఇరిగేషన్ కార్యాలయం వద్ద 25లక్షల రూపాయలతో మరో భవనం నిర్మించేలా ప్రభుత్వం మంజూరు చేసింది. పంటవీధిలోని భవనాన్ని పూర్తిచేశారు. అయితే ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో అధునాతనంగా మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మించడంతో అందులోనే ఒక భవనాన్ని మెప్మా కార్యాలయానికి కేటాయించగా అక్కడ కొనసాగుతోంది. పంటవీధిలోని మెప్మా భవనాన్ని వార్డు సచివాలయానికి కేటాయించగా కొనసాగుతోంది. అయితే పనులు నిలిచిపోయిన భవనం మాత్రం చుట్టూరా కంపచెట్లతో ఉండగా దాన్ని ఎవరైనా చూడడం కానీ, పరిశీలించడం కానీ, తదుపరి చర్యలు తీసుకునే యోచన చేయడం కానీ జరగలేదు. ఈలెవల్ పనులకు వెచ్చించిన నిధులు వృధా అయినట్లేనని సర్వత్రా భావిస్తున్నారు, ఆత్మకూరు మండలంలో అనాదిగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అనేక భవనాలను వినియోగించకుండా వదిలేయడం, కొన్ని భవనాలు పనులు ప్రారంభించి నిధులకొరత అంటూ అర్ధాంతరంగా నిలిచిపోయి దర్శనమిస్తుండడం, ఈవిషయాన్ని పదేపదే పత్రికలు ఘోషించినా పట్టించుకునే నాధుడు లేకపోవడం పరిపాటిగా మారింది. ఆత్మకూరు పట్టణంలో ఆర్డీవో,తహశిల్దారు కార్యాలయాల భవనాలు దశాబ్దకాలంగా పనులు పూర్తికాకుండా దర్శనమిస్తున్నాయి. ఫారెస్ట్ శాఖ గతంలో సాధారణ, సోషల్‌ఫారెస్ట్, తెలుగుగంగ విభాగాలుగా ఉండగా మూడు కార్యాలయాలు, ముగ్గురు రేజర్‌లకు, సిబ్బందికి క్వార్టర్స్, నెల్లూరుపాళెం చెక్‌పోస్ట్ వద్ద క్వార్టర్లు నిర్మించగా కొంతకాలానికి తెలుగుగంగ విభాగాన్ని తరలించగా అప్పటినుండి సాధారణ అటవీవిభాగ కార్యాలయ భవనం మాత్రమే వినియోగంలో ఉండగా మిగతావన్నీ నిరుపయోగంగా శిధిలమవుతున్నాయి. కరటంపాడు మజరా సాతానుపల్లిలో ఈ గ్రామాన్ని వరదలదృష్ట్యా ఎగువ ప్రాంతానికి తరలించాలంటూ లక్షలాది రూపాయలు వెచ్చించి పట్టాపొలాన్ని కొనుగోలు చేసి గ్రామస్థులకు పట్టాలిచ్చారు. వారు అక్కడకు నివాసాలు వెళ్ళకుండానే ముందస్థుగా ఒక వంతెన, ఒక కమ్యునిటిహాల్, ఒక పాఠశాల భవనాలను దాదాపు 17లక్షల రూపాయల వ్యయంతో నిర్మించగా అవి నిరుపయోగంగా శిధిలమవుతున్నాయి. పాతజంగాలపల్లిలో పాఠశాలలేకుండానే ఒక భవనం నిర్మించగా వినియోగించకుండానే శిథిలమై గత ఏడాది తొలగించారు. మహిమలూరులో ఒక డ్వాక్రాభవనం నిధుల కొరతతో రెండుదశాబ్దాలుగా పనులు పూర్తికాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రభుత్వం కొంతమేరకు నిధులు మంజూరు చేయడం, అర్ధాంతరంగా పనులు నిలిచిపోతుండడం, పూర్తిగా నిధులిచ్చిన భవనాలు పూర్తయినా వినియోగంలో లేకపోవడం జరుగుతుండగా రికార్డులను బట్టి కానీ, నేరుగా కానీ ఈపరిస్థితి ఎందుకుంది, ఏంచేయాలి, వినియోగంలోకి తెచ్చేదెలా అని యోచించే పరిస్థితే కానరావడం లేదు. అవసరమైనచోట భవనాలు కావాలన్నా మంజూరు కాకున్నా సాతానుపల్లి, పాతజంగాలపల్లి లాంటి చోట్ల అనవసరంగా లక్షలరూపాయల నిధులు వ్యయం చేయడాన్ని మరి అధికారులు ఎలా భావిస్తుంటారో అని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. ఆత్మకూరు మండలంలో ఈపరిస్థితిని బట్టి దాదాపు ఒక కోటిరూపాయల ప్రభుత్వ నిధులు వృధా అయినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఏదేని స్పందన లభిస్తుందేమో చూడాల్సి ఉంది.



ఆత్మకూరులో పనులు నిలిచిపోయిన మెప్మా భవనం